పుచ్చకాయలకు భలే డిమాండ్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కళింగరను కొనేందుకు ప్రజల ఆసక్తి
- రోడ్ల పక్కన తాత్కాలిక పందిర్లు వేసి జోరుగా అమ్మకాలు

హిందూపురం: మండుటెండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం 9 గంటల తర్వాత ఎండలు సుర్రుమంటున్నాయి. ఉక్కపోత, వేసవితాపంతో దాహార్తితో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలు (వాటర్ మిలన్)ను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. 82 శాతం నీరుండే పుచ్చకాయలకు ప్రస్తుతం విపరీతంగా డిమాండ్ పెరిగింది.

జోరుగా వ్యాపారం..

హిందూపురం నియోజకవర్గం పరిధిలో రోడ్ల పక్కన పెద్ద ఎత్తున పుచ్చకాయల వ్యాపారం సాగుతోంది. వ్యాపారులు హోల్‌సెల్, రీటెల్‌గా విక్రయాలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పట్టణం, చుట్టుపక్కల పల్లెల్లో వ్యాపారం అమ్ముతున్నారు. అలాగే అలాగే తోపుడు బండ్లపై పుచ్చకాయలు ఉంచుకుని ముక్కలుగా కోసి వీధుల వెంబడి కూడా వ్యాపారం చేస్తున్నారు.

సైజులను బట్టి ధర

పుచ్చకాయ బరువును బట్టి ధర నిర్ణయిస్తున్నారు. కిలో రూ.20 నుంచి 30 చొప్పున కాయ రూ.100, 200 వరకూ ధర పలుకుతోంది. మరీ చిన్నవైతే కాస్త తక్కువ ధరకు ఇచ్చేస్తున్నారు. ముక్కలుగా కోసిన పండు అయితే చిన్న ప్లేట్ రూ.10, పెద్ద ప్లేట్ అయితే రూ.20 లెక్కన అమ్ముతున్నారు. దీంతో పాటు కూల్‌డ్రింక్ షాపుల్లో కూడా పుచ్చకాయ జ్యూస్ విరివిగా సెల్ అవుతోంది.


హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన పుచ్చకాయల వ్యాపారం

ఆరోగ్యానికి మేలు



పుచ్చకాయలో 82 శాతం నీరు ఉండటంతో శరీరానికి చల్లదనం చేకూరుతుంది. పోషకాలు కూడా ఎక్కువే. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి, రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే పోషకాలు గుండె, శరీర ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తాయి.

– మంజునాథ్,వైద్యుడు, బేవనహళ్లి పీహెచ్‌సీ,హిందూపురం

ఉపాధి లభిస్తోంది



వేసవికాలంలో చాలా మందికి పుచ్చకాయల వ్యాపారం ఉపాధినిస్తోంది. ప్రధాన కూడళ్ల వద్ద తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగిస్తున్నాం. పెరిగిపోతున్న ఎండలతో వ్యాపారం కొంతవరకు బాగానే ఉంది. పుచ్చకాయలు కిలోల ప్రకారం ఒక్కొకటి రూ.100 నుంచి రూ.200 వరకూ అమ్ముతున్నాం. గిరాకీ బాగానే ఉన్నా ట్రాన్స్‌పోర్టు తదితరాలతో పాటు మున్సిపాల్టీ ఫీజులు, స్థలం బాడుగలతో కొంత ఇబ్బందిగా ఉంది.

– షబ్బీర్, వ్యాపారి, హిందూపురం


ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	35.0
పెనుకొండ	38 .0
మడకశిర	35.0

16న మండల మీట్

సోమందేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. మండలాభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంతో ఈనెల 16 మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పక సమావేశానికి హాజరు కావాలన్నారు.

రేపు ప్రవేశ పరీక్ష

అమరాపురం: మండల పరిధిలోని హాలుకూరు గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరడానికి ప్రవేశ పరీక్షను ఈ నెల 13వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

టీడీపీ నాయకుల దాడి - కేసు నమోదు


గాయపడిన బాధితులు

సోమందేపల్లి: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకులు తమపై దాడి చేశారని నరేష్, రామాంజి, మారుతీ, అంజనేయులు, లక్ష్మీదేవి, రుచిత శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలమేరకు.. స్థానిక శివానగర్‌లో కుక్కదాడి చేయడానికి వచ్చిందని, కుక్క యజమానిను నిలదీశామన్నారు. అయితే తమ ఇంటి వద్దకే వచ్చి నిలదీస్తారా అని ప్రశ్నించారన్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు టీడీపీ కార్యకర్తలు తమ ఇళ్ల వద్దకు వచ్చి దాడి చేశారన్నారు. తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం వారిని చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రపుకొండ అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహించారు, పౌష్టికాహార వస్తువులతో ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్‌ను అధికారులు తిలకించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి , సూపర్ వైజర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చిన 65 మంది గర్భిణులకు కరణం రమామణి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. గర్భిణుల ఆకలి తీర్చాలనే అన్నదానం చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గోరంట్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. విగ్రహదాత, ఎస్ఆర్ఐ శేషాద్రిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా ఎమ్మార్పీఎస్ నాయకులు అన్ను సన్మానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, కమ్మవారిపల్లి సర్పంచ్ సుధాకరరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ సోకకుండా మందులు

హిందూపురం: టీబీ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారికి రక్త పరీక్ష నిర్వహించి టీబీ ఇన్ఫెక్షన్ ఉన్నా వ్యాధి సోకాకుండా ముందు జాగ్రత్తగా మందులు పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ పద్మజ తెలిపారు. మండలంలోని కిరికెర పంచాయతీలో డాక్టర్ పద్మజా ఆధ్వర్యంలో సీవైటీబీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ గొస్పీర్, ఎంపీహెచ్ఈఓ మల్లప్ప, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం: పట్టణంలోని నారాయణ పాఠశాల నిర్వాహకులు విద్యాసంవత్సరం, వేసవి సెలవులు పూర్తికాక ముందే అనుమతి లేకుండా ముందస్తుగా పుస్తకాలు అమ్ముతున్నారని, వెంటనే పాఠశాలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రాన్ని అందించారు. మండల విద్యాశాఖ అధికారి గంగప్ప నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఎంఈఓపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈరేష్, నాగర్జున, సురేష్, భరత్ చంద్ర, మహేష్, హరి , రవి తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశారమ్మా...


పెద్దిరెడ్డిపల్లిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఉషశ్రీచరణ్

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ముందు పెద్దిరెడ్డిపల్లి వాసుల ఆవేదన

పరిగి: గడిచిన ఐదేళ్లలో తమ కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు లేని లోటును అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారు. అయితే గత ఎన్నికల్లో కూటమి నేతల మాటలకు నమ్మి మోసపోయాం. ఇది తమకు సిగ్గుగా ఉందని పెద్దిరెడ్డిపల్లి గ్రామస్తులు ఉషశ్రీచరణ్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో తమ జీవితాలు మారి పోతాయనుకున్నాం కాని ఇంతలా మోసపోతామని ఊహించలేకపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయ వర్గాలకు అతీతంగా అన్ని పథకాలను పారదర్శకంగా అందించారన్నారు. భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల ఆందోళన

మడకశిర: మడకశిరలో రెండోరోజైన శుక్రవారం కూడా ఆర్టీసీ కార్మికులు డిపో ఎదుట ఆందోళన చేశారు. ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసనకు దిగారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు రామకృష్ణ, ముద్దప్ప, కరియన్న, పురుషోత్తం, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు శుక్రవారం ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. పుట్టపర్తి డిపో అధ్యక్షులు శివశంకర్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాంనాయక్, షబ్బీర్, శంకర్, కేశప్ప, రవితేజ, తిరుపతమ్మ, అప్పిరెడ్డి, ఈశ్వరయ్య, గంగులయ్య, నూర్ మహమ్మద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


పెనుకొండలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

యథావిధిగా పన్నుల స్వీకరణ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ సెలవులు ఉన్నప్పటికీ ఇంటి పన్నులు చెల్లించేందుకు కౌంటర్ యథావిధిగా పనిచేస్తుందని కమిషనర్ సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిదారులు చెల్లించాల్సిన పన్నులు ఏకమొత్తంలో చెల్లించి వడ్డీ 50 శాతం రాయితీ పొందాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి, రొళ్ల, రత్నగిరితో పాటు అగళి మండలం రామనపల్లిలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్లలో అత్యవసర మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నిజాముద్దీన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

లక్ష్మీ నిడిమామిడమ్మకు పూజలు


అలంకరణలో లక్ష్మీనిడిమామిడమ్మ

మడకశిరరూరల్: మండల పరిధిలోని జమ్మానిపల్లిలో లక్ష్మీ నిడిమామిడమ్మ ఆలయ వార్షికోత్సంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, నవగ్రహ, మృత్యుంజయ, రుద్ర స్వాహకార హోమం, కలశ అర్చన, పూర్ణహుతి తదితర పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని చిన్న సన్నకారు రైతులు మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ జగదీష్ తెలిపారు. ఉపాధి పథకం ద్వారా నీటి వసతి ఉన్నా లేకున్నా రైతులు ఆయా గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, సచివాలయం, లేదా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే సహించం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప


అసభ్యకర పోస్టులను మూకుమ్మడిగా ఖండిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుటుంబంపై సోషల్ మీడియాలో ఐ టీడీపీ సభ్యులు అసభ్యకర పోస్టులు పెడితే సహించబోమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఐ టీడీపీ సభ్యుడు కిరణ్ అసభ్యకరమైన పోస్టు పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా ఐ టీడీపీ సభ్యులు అసభ్యకరమైన పోస్టులు పెడుతూ మహిళలను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నారా లోకేష్ ఐ టీడీపీ సభ్యులను అదుపు చేయకపోతే రాజకీయంగా భూస్థాపితం కావడం ఖాయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, కౌన్సిలర్ అన్సర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫకృద్దీన్, నాయకులు జయరాజు, మధు, నాగభూషణ్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, గోపి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించే అర్హత నీకు లేదు

అమరాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి ఎస్ఐ సుధాకర్ యాదవ్‌కు లేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. బాధ్యత గల ఓ ప్రభుత్వ ఉద్యోగిగా అందులో పోలీసులశాఖ పనిచేస్తూ ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి ఓ పార్టీకి కొమ్ము కాస్తూ మాజీ సీఎంను ఏకవచనంతో మాట్లాడడం పద్ధతి కాదన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, అయితే ఉద్యోగంలో చేరిన తరువాత పదవీ విరమణ వరకు సేవలు అందించాల్సి ఉంటుందని గుర్తు చేసుకొని మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, వారి కుటుంబీకులు చెప్పినట్లు పని చేస్తూ వృత్తి ధర్మాన్ని విస్మరించిన సుధాకర్ యాదవ్ పోలీసు ఉద్యోగానికి అనర్హుడన్నారు. తక్షణమే ఆయనపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉన్నత పాఠశాల తనిఖీ

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం పెనుకొండ ఉప విద్యాశాఖ అధికారిణి విద్యప్రియ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

గుడిబండ: మండల పరిధిలోని దాసరిపల్లి పొలిమేరలో శుక్రవారం జూద కేంద్రంపై దాడి చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుళాయప్ప తెలిపారు. ఐదుగురు జూదారులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.29,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్షయ రోగులకు పరీక్షలు

పెనుకొండ: పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో క్షయ వ్యాధి గ్రస్తులకు శుక్రవారం చర్మ పరీక్షలు నిర్వహించారు. జాతీయ క్షయ నివారణలో భాగంగా ఈ పరీక్షలు ప్రారంభించారు. క్షయ వ్యాధిపై వైద్యాధికారి ఉదయకిరణ్ అవగాహన కల్పించారు. టీబీ యూనిట్ సిబ్బంది శశిధర్, రెడ్డమ్మ, అఫ్జల్, రావ్, శ్రీనివాస్, నరసింహులు, ఆషా పాల్గొన్నారు.

ఘనంగా మహావీర జయంతి

పావగడ: పట్టణంలోని జైన్ మతస్తుల ఆధ్వర్యంలో భగవాన్ మహావీర జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ, పానకం, పెసర బేడలు పంపిణీ చేశారు. మహావీర చిత్ర పటానికి పూజలు చేశారు. సుందర రాజయ్య, అజిత్ రాజయ్య, వృషభ రాజయ్య, ప్రఫుల్లా జైన్, జ్వాలా సుందర జైన్, జయపద్మ జైన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు

సోమందేపల్లి: అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన సోమందేపల్లిలోని అక్కమ్మ కొండ వద్ద ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకంతో పాటు స్వామివారికి మంగళహారతి ఇచ్చారు. దాతలు శ్రీకాంత్, నరసమ్మ స్వామి వారికి కిరీటంతో పాటు గొడుగును అందజేశారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ర్యాలీ


పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పెనుకొండ రూరల్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పెనుకొండలో ముస్లిం మైనార్టీలు శుక్రవారం ఈద్గా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ గిరిధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజ హక్కులకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ చట్టం ద్వారా ముస్లింలకు తీవ్ర అన్యాయం జరగతుందన్నారు. వక్ఫ్ బోర్డ్ బిల్లును వెంటనే రద్దు చేసి వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు నవాజ్, ఇలియాజ్, గుల్‌జార్, ముస్తాక్, ముక్తీ సాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

పెనుకొండ: పట్టణంలో శుక్రవారం పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ చేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సీఐ, ఎస్ఐ, స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ర్యాలీని పోలీసులు సెల్‌ఫోన్లలో బంధించారు.

వైభవంగా సీతారామ కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన భక్తులు

హిందూపురం: పట్టణంలోని దండురోడ్డులోని అభయాంజనేయస్వామి రాతి విగ్రహ ఆలయం వద్ద శుక్రవారం స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో అశేష భక్తజనం మధ్య వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య సీతారామ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అక్షింతలు, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నగదు, బంగారం అపహరణ

పావగడ: తాలూకాలోని పళవల్లి, పావగడ పట్టణంలో గురువారం రెండు భారీ చోరీలు జరిగాయి. పళవల్లిలో సుబ్బరాయప్ప, పద్మావతి దంపతులు ఈ నెల 5న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న రూ 1.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తస్కరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పావగడ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అలాగే పట్టణంలోని తుమకూరు రోడ్డులోని గంగా ఎంటర్ ప్రైజస్ షాపు తాళం పగుల గొట్టి బీరువాలోని రూ.80 వేల నగదు అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న ఆర్ఎంసీ దుకాణంలో నిత్యావసర సరుకులు, రూ.12 వేల నగదు ఎత్తుకెళ్లారు. అయితే సంఘటనా స్థలంలో పోలీసులకు మొబైల్ ఫోన్ లభించడంతో దాని ఆధారంగా విచారణ జరిపే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే


మడకశిర: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు


హిందూపురం: జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


పెనుకొండ: డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సాక్షిబృందం: జ్యోతిరావు పూలే భావితరానికి స్ఫూర్తి ప్రదాత అని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప కొనియాడారు. మడకశిర పట్టణంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరిగాయి. జ్యోతిబా పూలే విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ పూలే జయంతిని నిర్వహించారు. మరోవైపు హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోనూ పూలే జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.